వైఎస్ జగన్‌ను కలిసిన మెట్టు శ్రీకాంత్



వైఎస్.జగన్‌తో మెట్టు శ్రీకాంత్

అబిడ్స్: ఇండియన్ రైల్వే బోర్డు సభ్యుడిగా నియమితులైన గోషామహల్ నియోజకవర్గానికి చెందిన తెలంగాణ రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ యువజన విభాగం నాయకుడు డాక్టర్ మెట్టు శ్రీకాంత్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మెట్టు శ్రీకాంత్‌కు శాలువా కప్పి సన్మానించి అభినందించారు.

ఆకట్టుకుంటున్న గోనె సంచుల గణనాథులు



నాంపల్లి: పర్యావరణ హితాన్ని కోరుతూ జేఎన్ఏఎఫ్ఏయూ కళాశాల విద్యార్థులు తయారు చేసిన గోనె సంచుల గణనాథులు ఆకట్టుకుంటున్నాయి. మాసబ్‌ట్యాంక్‌లోని కాలేజీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మండపం నుంచి ప్రధాన గేటు వరకు గోనె సంచులతో తయారు చేసిన వినాయకుడి బొమ్మలనే స్వాగత తోరణాలుగా అలంకరించారు. గోనె సంచులు, వెదురు కట్టెలు, కాగితాలతో వినాయకుడి బొమ్మలు తయారు చేసినట్లు విద్యార్థులు పేర్కొన్నారు.

28న జేఎన్ఏఎఫ్ఏయూలో స్పాట్ అడ్మిషన్లు

విజయనగర్‌కాలనీ: మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ ప్రాంగణంలో ఈనెల 28న మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వినోద్ గణేశ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్లానింగ్, డీటీడీపీ, బీఎస్ఈ (బిల్డింగ్ సర్వీసెస్ ఇంజినీరింగ్) సీట్లకు ఇంటర్వ్యూలు ఉంటాయని ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు గురువారం ఉదయం 11 గంటలకు ఫొటోలు, ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని ఆయన కోరారు.

చిన్నారులను క్రీడల్లోనూ ప్రోత్సహించాలి



గన్‌ఫౌండ్రీ: చిన్నారులను క్రీడల్లోనూ ప్రోత్సహించాలని ఎల్‌వీఎస్ చెస్ అకాడమీ డైరెక్టర్ ఎల్‌వీ.శివకుమార్ అన్నారు. ఎల్‌వీఎస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో 2 రోజులుగా నిర్వహించిన ఓపెన్ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్ మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు.

కేర్ టేకర్‌పై దాడి

సంతోష్‌నగర్: మసీదు కేర్ టేకర్‌పై దాడికి పాల్పడిన ఘటన సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. సంతోష్‌నగర్ ఫాతీమానగర్‌కు చెందిన మహ్మద్ జాఫర్ కుమారుడు మహ్మద్ నవీద్ అలీ (38) చాంద్రాయణగుట్టలోని మసీదు–ఎ–షైఖా హస్సా బింట్ మహ్మద్ అల్ నహియాన్‌లో కేర్ టేకర్‌గా 22 ఏళ్లుగా పని చేస్తూ 15 సంవత్సరాలుగా మసీదు ఆవరణలో నివాసముంటున్నాడు. నవీద్ అలీ కేన్సర్ నాలుగో దశలో ఉన్నాడు. అతని అనారోగ్యం కారణంగా మసీదు కమిటీ అతనికి ఉచిత వసతి, నెలవారీ రూ.2 వేల భత్యం అందించాలని గతంలో నిర్ణయించింది. మూడేళ్లుగా హబీబ్ అహ్మద్, జమాలుల్‌లెల్, హబీబ్ హసన్, హబీబ్ అబూబాకర్‌తో పాటు మరికొంతమంది నవీద్ జీత భత్యాన్ని నిలిపేసి ఆవరణను ఖాళీ చేయాలని కొన్ని రోజులుగా వేధింపులకు గురి చేస్తున్నారు. ఇందులో భాగంగా కేర్ టేకర్ నవీద్ అలీని మంగళవారం మరోసారి వారందరూ కలిసి దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆసిఫ్‌నగర్‌లో డ్రగ్స్ పెడ్లర్ అరెస్టు

విజయనగర్‌కాలనీ: మాదక ద్రవ్యాల సప్లైయర్‌ను అదుపులోకి తీసుకున్న ఘటన మంగళవారం ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ నడికుడ ఆనంద్, ఎస్‌ఐ.ఎ.రామాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫ్‌నగర్ చంద్ర వైన్స్ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. అతడిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 12 గ్రాముల ఎండీఎంఏ మత్తుపదార్థం లభించింది. మరింత విచారించగా తన పేరు యోశ్రీ అల్‌మెన్ అల్‌బిడ్ (35) కర్ణాటక రాష్ట్రం బెంగళూర్‌కు చెందినవాడినని తెలిపారు. ఆసిఫ్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తికి మత్తు పదార్థం అందించేందుకు వచ్చినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు.

గణేశ్ నవరాత్రులకు సిద్ధం..!

- పాతబస్తీలో ముస్తాబైన మండపాలు
- ఈసారి మట్టి విగ్రహాలకు ప్రాధాన్యత
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



మీరాలంమండిలో పూజలకు సిద్ధంగా ఉన్న మట్టి విగ్రహం



పత్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు

చార్మినార్: గణేశ్ నవరాత్రులకు పాతబస్తీ ముస్తాబయ్యింది. ఇప్పటికే నిర్వాహకులు మండపాలను సర్వంగా సుందరంగా ముస్తాబు చేశారు. మరో వైపు వినాయక విగ్రహాలు మండపాలకు తరలిస్తున్నారు. ఇంకోవైపు పోలీసులు, జీహెచ్‌ఎంసీ అధికారులు సైతం ఎప్పటికప్పుడు సమీక్షా సమావేశాలు నిర్వహించి నిర్వాహకులకు పలు సలహాలు, సూచనలు చేశారు. వినాయక నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని స్వదేశీ వస్తువులను మాత్రమే వినియోగించాలని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి నిర్వాహకులను కోరుతోంది.

పనుల కోసం రూ.4.50 లక్షల నిధుల మంజూరు

జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ పరిధిలోని రెండు పోలీసు జోన్ల పరిధిలో సివిల్ వర్క్స్ కోసం రూ. 4.50 లక్షల నిధులు మంజూరైనట్లు సంబంధిత జోనల్ కమిషనర్ తెలిపారు. సౌత్ ఈస్ట్ జోన్ పరిధిలోని సర్కిల్–6 (మలక్‌పేట్)లో 4 సివిల్ వర్క్స్‌కు రూ.29.95 లక్షలు, సర్కిల్–8 (చాంద్రాయణగుట్ట)లో 20 పనులకు గాను రూ.199.35 లక్షలు మంజూరయ్యాయి. ఇక దక్షిణ మండలం పరిధిలోని సర్కిల్–7 (సంతోష్‌నగర్)లో 20 సివిల్ వర్క్స్‌కు గాను రూ. 86.81 లక్షలు, సర్కిల్–9 (చార్మినార్)లో 9 పనుల కోసం రూ.64.70 లక్షలు, సర్కిల్–10 (ఫలక్‌నుమా)లో 11 వర్క్స్‌కు గాను రూ. 69.15 లక్షల నిధులను వినాయక ఉత్సవాల కోసం వినియోగిస్తున్నట్లు ఆయన తెలిపారు.

మట్టి విగ్రహాలకు ప్రాధాన్యత

పాతబస్తీలో ఈసారి మట్టి విగ్రహాలు ప్రతిష్ఠించేందుకు నిర్వాహకులు చొరవ చూపుతున్నారు. పాతబస్తీలోని కొంతమంది ఉత్సవాల నిర్వాహకులు కోల్‌కత్తా నుంచి తెచ్చిన గంగా మట్టితో పాటు స్థానికంగా లభించే రేగడి మట్టితో కోల్‌కత్తా కళాకారులతో విగ్రహాలను రూపొందించారు. మరోవైపు ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో రూపొందించిన అతి భారీ విగ్రహాలు ఈసారి హైలెట్‌గా నిలువనున్నాయి.

భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు



గణేశ్ నవరాత్రుల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులేకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. బాలాపూర్ నుంచి కొనసాగే నిమజ్జనోత్సవ ప్రధాన ఊరేగింపు రూట్‌లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాం. రోడ్ల మరమ్మతులు, వీధి దీపాల ఏర్పాటు, పారిశుద్ధ్య పనుల కోసం స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నాం.

– సోలిపేట శ్రీనివాస్ రెడ్డి, జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్

పటిష్ట బందోబస్తు



శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా అదనపు బలగాలతో పాతబస్తీలో బందోబస్తు నిర్వహించనున్నాం. ఉత్సవాల నిర్వాహకులు కూడా ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే తమకు ఫిర్యాదు చేయాలి. మండపాల వద్ద నిర్వాహకులు తప్పనిసరిగా ఉండడంతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. నిమజ్జనోత్సవాల్లో పాల్గొనే భక్తులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకుని ప్రశాంతంగా పూజా కార్యక్రమాలు పూర్తి చేయాలి.

– చైతన్య కుమార్, దక్షిణ తూర్పు మండలం డీసీపీ

హైదరాబాద్ అభివృద్ధి ఘనత వైఎస్సార్‌దే

మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్



మాట్లాడుతున్న మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్

గోల్కొండ: హైదరాబాద్ అభివృద్ధితో పాటు మైనార్టీలకు రిజర్వేషన్ కల్పించిన ఘనత దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డిదే అని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ అన్నారు. టోలిచౌకీ జానకీనగర్‌లో 'చాయ్ పే చర్చా' కార్యక్రమంలో మంగళవారం సాయంత్రం పాల్గొని మాట్లాడారు. రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ అడ్డగోలుగా దోచుకుందని కానీ సీఎం రేవంత్‌రెడ్డి తన రెండేళ్ల పాలనలోనే అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతున్నారన్నారు. ముస్లిం, మైనార్టీలకు కాంగ్రెస్ ఎప్పుడూ అండగా ఉండి వారి హక్కుల పరిరక్షణకు కృషి చేసిందన్నారు. కార్యక్రమంలో షేక్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు డి.సత్యనారాయణ, గౌరీ సతీశ్, నిజాముద్దీన్, మొహినుద్దీన్ తదితరులు ఉన్నారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న జోనల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి

చార్మినార్: చాంద్రాయణగుట్ట నర్కిఫూల్‌బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి మట్టి వినాయక విగ్రహాలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూజజ పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మట్టి గణపతులను ప్రతిష్ఠించి పూజించాలని సూచించారు. కార్యక్రమంలో చాంద్రాయణగుట్ట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సురేందర్, యూసీడీ విభాగం డీపీఓ కరుణాకర్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



విగ్రహాలు పంపిణీ చేస్తున్న వెంకటేశ్, సంఘం ప్రతినిధులు

గౌలిపురా: లాల్‌దర్వాజా, గౌలిపురా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో లాల్‌దర్వాజా మహంకాళి ఆలయ సమీపంలో కాంగ్రెస్ నాయకుడు, లాల్‌దర్వాజా మహంకాళి ఆలయ మాజీ చైర్మన్ కె.వెంకటేశ్ మట్టి గణపతి ప్రతిమలను మంగళవారం పంపిణీ చేశారు. ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు సరాబు సంతోష్ కుమార్ గుప్తా, చాలిక నాగరాజు గుప్తా, గుగ్గిళ్ల సంతోష్ కుమార్ గుప్తా, రవి కుమార్ గుప్తా, సతీశ్, నగేశ్, అశోక్ కుమార్, రాములు, విశ్వేశ్వర గుప్తా, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథం కలిగి ఉండాలి



పురస్కార గ్రహీతలతో ఎస్.మధుసూదనాచారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: ప్రతిఒక్కరూ సామాజిక సేవా దృక్పథం కలిగి ఉండాలని శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసుదనాచారి అన్నారు. మదర్ ఫౌండేషన్, మెగాసిటీ నవకళావేదికల సంయుక్తాధ్వర్యంలో భారతరత్న మదర్ థెరిస్సా 115వ జయంతి వేడుకలను మంగళవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురికి సేవారత్న అవార్డులను ప్రదానం చేశారు. అంతకుముందు కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ఎం.వీరయ్య, సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ, హైకోర్టు న్యాయవాది ఆర్.భాస్కర్ నేత, ఫౌండేషన్ వ్యవస్థాపకులు మల్లికార్జున్‌రావు, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

కళా సంస్థలకు అండగా ఉంటాం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ ప్రభుత్వం కళా సంస్థలకు అండగా ఉంటుందని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో క్రియేటివ్ థియేటర్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోహినూర్ థియేటర్ కార్నివాల్ ఆఫ్ తెలంగాణ జాతీయ నాటకోత్సవాల పోస్టర్‌ను మంగళవారం రవీంద్రభారతిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళా సంస్థలకు ప్రభుత్వం తరపున సహాయ సహకారాలు అందిస్తామని హామీనిచ్చారు. సంస్థ వ్యవస్థాపకుడు ఎం.అజయ్ మాట్లాడుతూ.. సెప్టెంబర్ 15 నుంచి 3 రోజుల పాటు జాతీయ నాటకోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ అలేఖ్య పుంజాల, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, గేయ రచయిత అందెశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ట్రోఫీల ప్రదానం

యాకుత్‌పురా: ఇటీవల ముగిసిన జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్ల క్రీడాపోటీల్లో పలు విభాగాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్‌కు అధికారులు మంగళవారం ట్రోఫీలు ప్రదానం చేశారు. మహ్మద్ వసీవుద్దీన్ పరుగు పందెం, క్రికెట్, వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చూపి గెలుపొందారు.



కార్పొరేటర్ వసీవుద్దీన్‌కు ట్రోఫీ ప్రదానం చేస్తున్న అధికారులు

టోలిచౌకీలో ఎమ్మెల్యే పర్యటన



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: టోలిచౌకీ, నానల్‌నగర్ డివిజన్లలో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భారీ వర్షాలకు రోడ్లు బాగా దెబ్బతిన్నాయని అధికారులు వెంటనే ప్యాచ్‌వర్క్‌లు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, డీఈ రామకృష్ణ, నాయకులు హారూన్ ఫరాన్ తదితరులు ఉన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

గౌలిపురా: గణేశ్ నవరాత్రులను పురస్కరించుకుని లాల్‌దర్వాజా నాగులచింతలోని మదర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంస్థ కార్యాలయంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, చార్మినార్ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్ నిరుపేదలకు నిత్యావసర సరుకులను మంగళవారం ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అంకెనలప్లి మల్లికార్జున రావు, ప్రధాన కార్యదర్శి ఎ.రాఘవ, నిర్వాహకులు అరుణ మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.




ప్రొఫెసర్ దీపాలకు అవార్డు



ప్రొఫెసర్ కె.దీపాల

అబిడ్స్: తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ కె.దీపాలను ధ్యాన్‌చంద్ ఎక్సలెన్సీ అవార్డు–2025కు ఎంపిక చేసినట్లు ఆ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ తెలిపారు. ఈనెల 29న అంతర్జాతీయ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి రోజున అవార్డు అందజేస్తామని పేర్కొన్నారు. క్రీడారంగానికి, క్రీడా సంక్షేమానికి కృషి చేస్తున్న ప్రొఫెసర్లు కె.దీపాల, ఎం.శ్రీదేవి, మేజర్ శివప్రసాద్, డాక్టర్ సయ్యద్ ఫారుఖ్ కమల్, జి.కొండల్‌రెడ్డి, డాక్టర్ సయ్యద్ సిద్ధిఖీకి అవార్డులు అందజేసి జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలతో సన్మానిస్తామని ఆయన తెలిపారు.

బాధ్యతల స్వీకరణ



నాంపల్లి: జీహెచ్‌ఎంసీ సర్కిల్–12 ఉప కమిషనర్‌గా టి.దశరథ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సురేందర్ రెడ్డి రాజేంద్రనగర్ ఉప కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు. గద్వాల నుంచి ఇక్కడికి దశరథ్ వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరి సహకారంతో సర్కిల్–12ను గ్రేటర్‌లోనే అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. అలాగే పలువురు ఉద్యోగులు, అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

సిటీ కాలేజీ అధ్యాపకులకు ప్రమోషన్లు



ప్రమోషన్ పొందిన అధ్యాపకులతో వైస్ ప్రిన్సిపాల్ తదితరులు

చార్మినార్: ప్రభుత్వ సిటీ కాలేజీకి చెందిన ఆరుగురు అధ్యాపకులకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా ప్రమోషన్ కల్పిస్తూ ఇటీవల కళాశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా కాలేజీలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జీసీటీఏ సంఘం ప్రమోషన్ పొందిన అధ్యాపకులను వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విప్లవ దత్ శుక్లా, అధ్యాపకులు డా.కె.భాస్కర్, డా.ఆనంద్, డా.చిత్తరంజన్, డా.వి.శ్రీదేవి, డా.డి.నాగరాజు, డా.టి.రాగసుధా, అధ్యాపకేతర బృందం అభినందించింది. సమావేశంలో జీసీటీఏ బాధ్యులు డా.తిరుపతి, డా.మల్లికార్జున్, డా.కృష్ణవేణి, డా.ఆది రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ నవరాత్రులను ప్రశాంతంగా జరుపుకోవాలి



సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ చంద్రమోహన్‌ను సన్మానిస్తున్న ఆబేద్



గుడిమల్కాపూర్ సమావేశంలో భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి సభ్యులు

గోల్కొండ: గణేశ్ నవరాత్రులను ప్రశాంతంగా జరుపుకోవాలని సౌత్ వెస్ట్‌జోన్ డీసీపీ జి.చంద్ర మోహన్ అన్నారు. సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ మోజంఅలీఖాన్ ఆధ్వర్యంలో కార్వాన్ ఎంకే ఫంక్షన్ హాల్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చవితి రోజుల్లో జరిగే కార్యక్రమాల వివరాలు ముందుగానే పోలీస్‌స్టేషన్‌లో ఇస్తే అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏసీపీలు మునావర్, సయ్యద్ ఫయాజ్, వెంకట్‌రెడ్డితో పాటు గోల్కొండ పీస్ కమిటీ అధ్యక్షుడు ఆబేద్, కార్యదర్శి ఇలియాస్ అలి తదితరులు ఉన్నారు.

నవరాత్రులను వైభవంగా నిర్వహించాలి

వినాయక చవితి ఉత్సవాలను వైభవంగా నిర్వహించుకుందామని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధి గోదా లక్ష్మీకాంత్‌యాదవ్ పిలుపునిచ్చారు. గుడిమల్కాపూర్‌లోని శ్రీకృష్ణ భవన్‌లో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి మండపం వద్ద బాలగంగాధర్ తిలక్, ఛత్రపతి శివాజీ మహారాజ్ చిత్రపటాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో శ్రీధర్‌సాగర్, జొన్నకుంటి మధుసూదన్ ఉన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు

విజయనగర్‌కాలనీ: ఆసిఫ్‌నగర్ నారాయణ పాఠశాలలో వినాయక చవితి వేడుకలను మంగళవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు గణపతి, మహా శివుడు, పార్వతీదేవి వేషధారణలో ఆకట్టుకున్నారు. అలాగే ప్రిన్సిపాల్ శశికళ వినాయక చవితి పండుగ విశేషాలు, ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో విద్యావేత్తలు గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, హైస్కూల్ కో ఆర్డినేటర్ శ్రీకాంత్, ప్రైమరీ స్కూల్ కోఆర్డినేటర్ కె.ఫర్జానా, ఈ కిడ్స్ కో ఆర్డినేటర్ రష్మికతో పాటు ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

